సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 4 । ఆగస్టు । 2024

HAPPY Friendship DAY

ముురికికూపాలు

- ఖాళీ ప్లాట్లు.. దోమలకు ఆవాసాలు
- పిచ్చిమొక్కలు, మురుగునీటి నిల్వలతో సీజనల్ వ్యాధులు



- ఇది జిల్లా కేంద్రంలోని చైతన్యకాలనీ. జనావాసాల మధ్య ఖాళీప్లాట్లు ఉన్నాయి. ఇందులో మురుగునీరు నిల్వ ఉంటోంది. ఆకుపచ్చరంగులోకి మారి చిన్నకుంటలా కనిపిస్తోంది. ఇందులో దోమలు వృద్ధి చెంది స్థానికులపై దాడి చేస్తున్నాయి. దీంతో తాము వ్యాధులకు గురవుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు.



పెద్దపల్లిలో కొత్తగా వెలసిన టీచర్స్‌కాలనీ ఇది. నివాసాల మధ్య మురుగుచేరింది. ఈ ఖాళీ ప్లాటులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతంలో దోమలు తమ ఆవాసాలుగా ఏర్పాటు చేసుకున్నాయి. స్థానికులపై తమ ప్రతాపం చూపుతున్నాయి. వాటి ధాటికి ప్రజలు వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారు.

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంగా ఏర్పాటైన పెద్దపల్లిలో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వారు ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగానే వదిలేస్తున్నారు. వాటి సమీపంలో నివాసం ఉంటున్నవారికి ఆ ఖాళీ ప్లాట్లు వ్యాధులు తెచ్చిపెడుతున్నాయి. కొత్త కాలనీలు కావడం, నివాసాల్లోంచి వెలువడే మురుగునీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీలు లేకపోవడం.. ఆ నీరంతా ఖాళీ ప్లాట్లలోకి చేరుతోంది. రోజులతరబడి నిల్వకావడంతో దోమలు ఆవాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. నీటిలో వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది.

పొంచి ఉన్న వ్యాధులు..

జిల్లా కేంద్రంతోపాటు సుల్తానాబాద్, మంథని పట్టణాలు, రామగుండం నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఖాళీప్లాట్లలోని మురుగునీరు, పిచ్చిమొక్కలు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి.

మున్సిపల్ పరిధిలో..

పెద్దపల్లి మున్సిపల్‌లో విలీనమైన రంగంపల్లి, బందంపల్లి, చందపల్లిలో వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారాయి. ఆయా ప్రాంతాల్లో ప్లాట్లు కొనుగోలు చేసుకున్న వారు వాటిని ఖాళీగా ఉంచుతున్నారు. అందులో పిచ్చిమొక్కలు పెరిగి, వర్షపునీరు నిలిచి దోమలు, ఈగలు తమ ఆవాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా శాంతినగర్, బందంపల్లి, చందపల్లి, రంగంపల్లి, పెద్దకల్వల శివారు ప్రాంతాల్లోని ఖాళీప్లాట్లలో ఈ సమస్య అధికంగా ఉంది.

పెద్దపల్లిలో డెంగీ కేసు

జిల్లా కేంద్రంలోని చీకురాయి రోడ్డుకు చెందిన ఓ వ్యక్తికి డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు శనివారం ఆ ప్రాంతంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దోమల నివారణ ద్రావణాన్ని వైద్య సిబ్బంది నవ్య, సైకిలాబ్‌రాణి, ఆశ వర్కర్ స్వప్న పిచికారీ చేయించారు. ప్రస్తుత వర్షకాలంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని వైద్యులను సంప్రదదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎరుకల కల్పన, నాయకుడు రమేశ్ ఉన్నారు.

నోటీసులు జారీచేశాం



కొత్తకాలనీల్లో ఖాళీప్లాట్లు అపరిశుభ్రంగా మారాయి. వాటి యజమానులను గుర్తించాం. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలని నోటీసులిచ్చాం. డ్రైనేజీలు లేని ప్రాంతాల్లో కచ్చాకాలువలు తవ్వించాం. నిల్వనీటిలో ఆయిల్‌బాల్స్ వేయించి దోమల వృద్ధిని నియంత్రిస్తున్నాం. పట్టణ అభివృద్ధికి మంజూరైన రూ.30కోట్లలో కొన్ని నిధులు వెచ్చించి డ్రైనేజీలు నిర్మిస్తాం.

– వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, పెద్దపల్లి

కొనసాగుతున్న ఎత్తిపోతలు



నంది పంప్‌హౌస్‌లో కొనసాగుతున్న ఎత్తిపోతలు

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం శివారులోని నంది పంప్‌హౌస్ నుంచి శనివారం నాలుగు పంప్‌లతో ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోస్తున్నారు. గతనెల 27న ప్రారంభించిన ఎత్తిపోతలు ఇప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. తొలిరోజు మూడు పంప్‌లను ఆన్‌చేసిన అధికారులు.. ఆ తర్వాత నాలుగురోజుల పాటు నీటిని మేడారం రిజర్వాయర్‌లోకి తరలించారు. గత మూడు రోజులుగా నాలుగు పంప్‌లతో పంపింగ్ చేయిస్తున్నారు. మేడారం రిజర్వాయర్ నుంచి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ వరకు తరలిస్తూ అక్కడ నుంచి బాహుబలి మోటార్లను ఆన్‌చేసి మిడ్‌మానేరు ప్రాజెక్టుకు తరలిస్తున్నారు.

నిబంధనల మేరకే ఎల్‌ఆర్‌ఎస్

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ తదితరులు

పెద్దపల్లిరూరల్: ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తిచేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రాష్ట్రంలోని కలెక్టర్లతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టివిక్రమార్క మాట్లాడారు. ప్రజాప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బంది కలుగకుండా, ప్రభుత్వానికి నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియతో ప్రభుత్వ భూములకు నష్టం కలుగరాదని అన్నారు. నీటి వనరులు, కాలువలు, చెరువుల ఆక్రమణలకు ఆస్కారం ఇవ్వొద్దని చెప్పారు. నాలుగు దశల్లో ఈ ప్రక్రియ పూర్తికావాలని సూచించారు. వీడియో కన్ఫరెన్స్‌కు కలెక్టర్ కోయ శ్రీహర్షతోపాటు మున్సిపల్ కమిషనర్లు తదితర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

పెండింగ్ భూసమస్యలు పరిష్కరించాలి

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ అన్నారు. శనివారం నిర్వహించిన సమీక్షలో పలు జిల్లాలతోపాటు పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కొత్త ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లును ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఈ బిల్లుపై ప్రజలు తమ సందేహాలు, అభిప్రాయాలను సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ ద్వారా లేదా మెయిల్ ద్వారా ఈనెల 23వ తేదీవరకు వెల్లడించాలని కోరారు. ఆర్డీవో, అడిషన్ కలెక్టర్లు బిల్లును పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలని అన్నారు. ఆర్డీవోలు గంగయ్య, హనుమా నాయక్ పాల్గొన్నారు.

ఆత్మీయ బంధం.. స్నేహం

- కష్టసుఖాల్లో పాలుపంచుకునేది
- చివరిదాకా తోడు ఉండేది
- అదే నిజమైన ఫ్రెండ్‌షిప్
- విద్యార్థినుల అభిప్రాయం
- 'ట్రినిటీ'లో 'సాక్షి' చర్చాగోష్ఠి

నేడు ఫ్రెండ్‌షిప్ డే



ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా జరిగిన చర్చా గోష్ఠిలో కాలేజీ విద్యార్థినులు



పెద్దపల్లిరూరల్: 'తల్లితో చెప్పుకోలేని అనేక విషయాలను స్నేహితుల దృష్టికి తీసుకెళ్తారు.. తండ్రితో పాలుపంచుకోలేని అంశాలను ఫ్రెండ్స్‌తో చర్చించుకుంటారు.. కుటుంబసభ్యులతో చర్చించుకునే వీలులేని సమస్యలను దోస్త్ సలహాలు, సూచనలతో పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తారు.. కష్టాలు, సుఖాల్లోనూ వెన్నంటి ఉండే వారే మంచిమిత్రులు.. ఆదప సమయాల్లో అండగా ఉండేవాళ్లే అసలైన స్నేహితులు.. స్నేహానికి మతంతో సంబంధం లేదు.. కులం అవసరం లేదు.. వయోబేధం లేదు.. ఆడమగ అనే తేడా లేదు.. ఉండేది కేవలం ఆత్మీయ బంధం..' అంటున్నారు జిల్లా కేంద్రంలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు. ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా శనివారం కళాశాలలో 'సాక్షి' ఆధ్వర్యంలో విద్యార్థినులతో చర్చాగోష్ఠి నిర్వహించింది. ఇందులో పాల్గొన్న విద్యార్థినులు తమ అభిప్రాయాలను ఇలా వెల్లడించారు..

భరోసా కల్పించేవారే..



సంతోష సమయాల్లోనే కాదు.. ఆపదకాలంలోనూ అండగా ఉండేవారే స్నేహితులు. మేమున్నామనే భరోసా కల్పించేవారే నిజమైన ఫ్రెండ్స్. ప్రస్తుతం ఆధునిక పోకడలు ఉన్నాయి. మనసులను, మనుషులనూ మార్చేస్తున్నాయి. అందుకే స్వార్థపరులతో స్నేహం పెంచుకోవద్దు.

– ధనలక్ష్మి, ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల

అర్థం చేసుకోవాలి

ఒకరి మనసును మరొకరు అర్థం చేసుకోవాలి. కష్ట, సుఖాల్లోనూ పాలుపంచుకోవాలి. ఎల్లవేళలా ఆత్మీయత పంచుకోవాలి. ఇలాంటిదే మంచి స్నేహం. స్నేహబంధం వెలకట్టలేనిది. కుటుంబసభ్యులతో పాలుపంచుకోలేని అనేక విషయాలను స్నేహితులతోనే షేర్ చేసుకుంటారు.



– మల్లీశ్వరి

విలువైన బంధం



స్నేహబంధం ఎంతో విలువైంది. కుల, మతాలకు అతీతం. హృదయాంతరాల్లోంచి పుట్టుకొచ్చేది. ఇదే నిజమైన స్నేహం. చివరిదాకా ఇలాంటి నిజమైన స్నేహం నిలిచి ఉటుంది. మంచి ఫ్రెండ్ దొరికితే జీవితాంతం ఎంతో సుఖ, సంతోషాలతో ఉండే వీలుంది.

– అక్షిత

హద్దులు లేనిది..



స్నేహానికి పరిమితులు, హద్దులు ఉండవు. ఎంరితో పంచుకోలేని తమ కష్ట, సుఖాలు, బాధలు, సంతోషాన్ని ఫ్రెండ్స్‌తో పంచుకుంటారు. ఇలా చేయడం ఓ అనుభూతి. దీనిని మాటల్లో చెప్పలేం. అలాగే మనం చేసే తప్పులను సైతం ఎత్తిచూపి వాటిని సరిదిద్దే వారే నిజమైన స్నేహితులు. మంచిస్నేహం ఎల్లకాలం నిలిచి ఉంటుంది.

– మాధురి



చెలిమి.. కలిమి

- స్నేహబంధం గొప్పది
- మన మంచిని కోరేవారు స్నేహితులు
- కష్టసుఖాల్లో తోడుగా ఉంటారు..
- ఇంట్లో చెప్పలేని బాధలను వారితో పంచుకుంటాం
- పవిత్రమైన స్నేహంలో ఆనందం
- నేడు ఫ్రెండ్‌షిప్ డే

స్నేహ బంధం.. గొప్ప అనుబంధం. దీనికి వయసుతో సంబంధం లేదు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అందరిలో స్నేహభావం ఉంటుంది. ఒక్కచోట చేరితే సందడి వాతావరణం నెలకొంటుంది. ఇంట్లో చెప్పలేని బాధలను సైతం మిత్రులకు చెప్పుకొని, మనసు తేలిక చేసుకుంటాం. స్నేహితులు మన మంచిని కోరేవారు. తప్పును తప్పని చెప్పి, సూచనలు చేస్తారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటారు. స్నేహానికి కులం, మతం లేదు. మనకు కుటుంబం.. తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు, తల్లిదండ్రులు, తోబుట్టువులను ఇస్తుంది. ఒక్క మిత్రులను ఎంపిక చేసుకునే అవకాశం మాత్రమే మనకు ఉంటుంది. వారు మంచివారా, చెడ్డవారా అనేదానిపై మన ప్రవర్తన, పయనం ఆధారపడి ఉంటాయి. స్నేహం పవిత్రమైనదై ఉండాలి. అటువంటి స్నేహంలో ఆనందం ఉంటుంది. నేడు ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

కలిసి చదువు, వ్యాపారం



వేములవాడ: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అదే గ్రామానికి చెందిన వొలిమినేని నిత్యానందరావు చిన్నప్పటి నుంచి కలిసే చదువుకున్నారు. అడ్తీ వ్యాపారం చేశారు. 1995లో ఆది శ్రీనివాస్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆయన జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందినా, ఇప్పుడు విప్ స్థాయికి ఎదిగినా ఇద్దరి మధ్య స్నేహం అలాగే ఉంది. వేములవాడకు మకాం మార్చినా ఒకే వీధిలో ఇళ్లు నిర్మించుకున్నారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కళాశాల మైత్రి.. అసెంబ్లీదాకా



కోరుట్ల: కలిసి చదువుకున్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచి, నవ్వులు చిందిస్తూ కలిసే అసెంబ్లీకి వెళ్తున్నారు. స్నేహబంధానికి చిరునామాగా నిలుస్తున్నారు సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్. వీరిద్దరూ గుంటూరులోని విజ్ఞాన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. అప్పటి స్నేహం ఆ తర్వాత కూడా కొనసాగింది. తన స్నేహితుడు సంజయ్‌కి ప్రజాసేవపై ఉన్న ఆసక్తిని గమనించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరుట్ల అసెంబ్లీ టికెట్ కేటాయించారు. ఎన్నికల సమయంలో ఆయన గెలుపు కోసం ప్రచారం చేశారు. దీంతో సంజయ్ విజయం సాధించారు. తన చిన్ననాటి స్నేహితుడు కేటీఆర్‌తో కలిసి అసెంబ్లీలో అడుగుపెట్టారు.


45 ఏళ్లుగా కష్టసుఖాల్లో..



కనకయ్యకు సాయపడుతున్న మధుగౌడ్ (కుడివైపు వ్యక్తి)

సిరిసిల్లకల్చరల్: ఈ ఫొటోలో టీషర్ట్‌లో ఉన్న వ్యక్తి జాగీరు మధుగౌడ్. ఆయన పక్కనున్నది బోయిని కనకయ్య. వీరిద్దరిదీ ముస్తాబాద్ మండలంలోని వెంకటాపూర్. పదోతరగతి వరకు కలిసి చదువుకున్నారు. తర్వాత మధు చదువు ఆపేసి, జీవనోపాధి కోసం వెల్డింగ్‌షాపు నిర్వహిస్తున్నాడు. కనకయ్య డిగ్రీ, ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి, కొన్నాళ్లు విద్యావలంటీర్‌గా పని చేశాడు. వేతనం సరిపోక వ్యవసాయం చేస్తున్నాడు. కులాలు వేరు, ఉపాధి మార్గాలు వేరైనప్పటికీ ప్రతిరోజూ కలుసుకుంటారు. సాగు పనుల సమయంలో మధు కనకయ్యకు సాయం చేస్తుంటాడు. మధుకు అవసరాల్లో కనకయ్య సాయపడుతున్నాడు. ఇలా వీరు 45 ఏళ్లుగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు.


కలెక్టరేట్‌లో చిగురించిన స్నేహం




కుటుంబసభ్యులతో కిషన్, రవికుమార్, రాకేశ్, వసంత్, వినయ్‌సాగర్

కరీంనగర్ అర్బన్: 2012లో కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉద్యోగులు.. జూనియర్ అసిస్టెంట్లుగా ఉన్నప్పుడు ఆ ఐదుగురి మధ్య స్నేహం చిగురించింది. ప్రస్తుతం వీరిలో నేరెళ్ల కిషన్(బావుపేట) కలెక్టరేట్ రెవెన్యూ ప్రధాన విభాగంలో నాయబ్ తహసీల్దార్, కుంబాల రవికుమార్(నిట్టూరు) జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండల తహసీల్దార్, భూషణబోయిన రాకేశ్ (కరీంనగర్) మానకొండూరు నాయబ్ తహసీల్దార్ (ఎపిక్), ఎడ్ల వసంత్(కొత్తకొండ) వెల్ది ప్రభుత్వ వైద్యశాలలో సీనియర్ అసిస్టెంట్, వినయ్‌సాగర్(కరీంనగర్) నిజామాబాద్ రూరల్ నాయబ్ తహసీల్దార్‌గా పని చేస్తున్నారు. ఎక్కడున్నా నెలలో ఒక్కసారైనా కలుసుకొని, యోగక్షేమాలు చర్చించుకుంటారు. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు. పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం, ఇతర శుభకార్యాలను కలిసే నిర్వహించుకుంటున్నారు. అనాథలకు పండ్ల పంపిణీ, ఆర్థికసాయం, వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేస్తున్నారు.

మిత్రుడి యాదిలో.. ఓ బడి




దయానంద్ మెమోరియల్ స్కూల్



దయానంద్ (ఫైల్)

సిరిసిల్ల: చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు.. వారిలో ఒకరు సిరిసిల్ల పద్మనగర్‌కు చెందిన గోసికొండ దయానంద్ 2002లో ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని అతని స్నేహితులు తట్టుకోలేక పోయారు. దయానంద్ జ్ఞాపకాలను శాశ్వతం చేయాలన్న తలంపుతో ఓ బడి నిర్మించాలనుకున్నారు. మిత్రుల్లో ఒకరైన గాజుల శ్రీనివాస్ యూఎస్‌ఏలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. దయానంద్‌పై అభిమానంతో సిరిసిల్ల పట్టణ శివారులో 22 గుంటల స్థలం కొనుగోలు చేసి, రూ.30 లక్షలతో దయానంద్ మెమోరియల్ స్కూల్ నిర్మించారు. దశాబ్దకాలంగా పేద విద్యార్థులకు ఉచితంగా ఆంగ్లమాధ్యమంలో విద్యనందిస్తున్నారు. ప్రస్తుతం స్కూల్లో 65 మంది చదువుకుంటున్నారు. నిర్వహణకు ఏటా రూ.5 లక్షలు ఖర్చవుతోంది. ట్రస్ట్ అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాస్ ఉన్నారు. స్నేహితులు బోడ రవీందర్, సిరిసిల్ల తిరుపతి, కట్కం గోపి, పయ్యావుల శ్రీనివాస్, బి.రాము, బొడ్డు శ్రీధర్, లింగమూర్తి, సిరిసిల్ల తిరుమలేశ్, వూరడి రవి, కోడం సుధాకర్ బడి నిర్వహణలో భాగస్వాములవుతున్నారు.


మా ఫ్రెండ్ కలెక్టర్



ఫ్రెండ్స్‌తో కలెక్టర్ ఆంజనేయులు (వృత్తంలో)

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంటలోని కాకతీయ స్కూల్లో 1998–99 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు 95 మంది. వీరిలో ఒకరు ఇప్పుడు కలెక్టర్‌గా ఉన్నారు. ఆయనే అబాది జమ్మికుంటకు చెందిన దొడ్డె ఆంజనేయులు. ఐఏఎస్‌గా ఎంపికై, ప్రస్తుతం జార్ఖండ్ రాష్ట్రంలోని డూమ్ జిల్లాలో కలెక్టర్‌గా ఉన్నారు. చిన్ననాటి మిత్రులందరం 6 నెలలకోసారి కలుసుకుంటామని, తమ కుటుంబాల్లో శుభకార్యాలకు కలెక్టర్ ఆంజనేయులుతోపాటు అందరం హాజరవుతామని ఆయన క్లాస్‌మేట్ కూర్మాచలం సందీప్ తెలిపాడు. తాము ఒకరికొకరం సహాయ సహకారాలు అందించుకుంటామని, ఆంజనేయులు కలెక్టర్ అయినా స్నేహితులతో సరదాగా ఉంటాడని పేర్కొన్నారు.

ఎమోషనల్‌గా ఉంటుంది



ఫ్రెండ్ ఇమ్రాన్‌తో శ్రీకాంత్ (ఎడమ)

కోల్‌సిటీ(రామగుండం): మా ఇంటి దగ్గర ఇమ్రాన్, తహసీన్ అహ్మద్ క్లోజ్‌గా ఉండేవారు. స్కూల్‌కు వెళ్లొచ్చాక నాన్న స్కూటీ నడిపేవాళ్లం. వాళ్ల బాటిళ్లలో పెట్రోల్ తెచ్చేవాళ్లు. ఇప్పుడు సాఫ్ట్‌వేర్, టీచర్ ఉద్యోగాల్లో ఉన్నారు. వేణుగోపాల్, తిరుపతి నా బెస్ట్ ఫ్రెండ్స్. తిరుపతి కెమికల్ కంపెనీలో పని చేస్తున్నాడు. వృత్తి రీత్యా ఎక్కడెక్కడో సెటిల్ అయ్యాం. కలిసినప్పుడు చాలా ఎమోషనల్‌గా ఉంటుంది.

– సీహెచ్.శ్రీకాంత్, కమిషనర్, రామగుండం నగరపాలిక

క్లుప్తంగా

డీజీపీని కలిసిన 'కోలేటి'



జ్ఞాపిక అందిస్తున్న దామోదర్

గోదావరిఖని: డీజీపీ జితేందర్‌ను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ శనివారం కలిశారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జ్ఞాపిక బహూకరించారు.

ఐటీఐలో సీట్ల భర్తీ

రామగుండం: జిల్లా కేంద్రంలోని ఐటీఐలో ఇంజినీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్లలో మూడోవిడత సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌రెడ్డి శనివారం తెలిపారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో ఈనెల 12వ తేదీలోగా https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఇందుకోసం రూ.వంద రుసుం చెల్లించాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు.

18లోగా ఫీజు చెల్లించండి

గోదావరిఖనిటౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024–2025 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 18వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ జి.సుబ్బారావు, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా శనివారం తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, డిప్లొమా, 10+2 పాస్ అయిన వారు నేరుగా అడ్మిషన్ పొందాలని సూచించారు. ఫీజును ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల్లో చెల్లించాలని కోరారు. వివరాలకు www.braouonlinein వెబ్‌సైట్‌లో లేదా సెల్‌నంబరకు 73829 29655 సెల్‌నంబరులో సంప్రదించాలని కోరారు.


పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: ప్రతీఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యంగా జీవించేలా ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ సూచించారు. తన కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి ఆవరణలో వ్యర్థాల్లో నీరునిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులు వస్తాయని తెలిపారు. దోమల బారిన పడి వ్యాధులు తెచ్చుకోవద్దన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేలా కార్యక్రమాలను చేపట్టాలని ఆయన సూచించారు. డెంగీ జ్వరంగా నిర్ధారిస్తే బాధితులకు అవసరమైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ శ్రీరాములు, సుధాకర్, వాణిశ్రీ, కిరణ్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

సింగరేణిలో అధికారుల బదిలీ

- భారీసంఖ్యలో అధికారులకు స్థానచలనం
- వివిధ విభాగాల్లో ప్రక్షాళన

గోదావరిఖని: సింగరేణి సంస్థలోని పలు విభాగాల అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో ఈఅండ్ఎం, సర్వే, ఎస్టేట్, ఫారెస్ట్ అధికారు ఉన్నారు. బదిలీ అయిన అధికారుల వివరాలు విభాగాల వారీగా..



ఈ అండ్ఎం విభాగం

అధికారి	హోదా	ప్రస్తుతస్థానం	బదిలీస్థానం
బి.సీతారామం	ఏజీఎం	ఏపీఏ	కార్పొరేట్
రాజశేఖర్‌రావు	ఏజీఎం	హైదరాబాద్	ఎస్టీపీపీ
జె.నాగరాజు	ఏజీఎం	మందమర్రి	విజయవాడ
వెంకటేశ్వర్‌రావు	డీవైఎస్ఎస్‌వో	కాసిపేట	మందమర్రి
కోటేశ్వర్‌రావు	డీవైఎస్ఎస్‌వో	జీడీకే–7ఎల్‌ఈపీ	కేటీకే(ఎస్టేట్)
కుమారస్వామి	డీవైజీఎం	భూపాలపల్లి	ఆర్జీ–1
కె.స్వప్న	ఎస్టేట	శ్రీరాంపూర్	మందమర్రి
బి.కర్ణ	డీజీఎం	ఆర్జీ–3	మందమర్రి
హరినారాయణ	డీజీఎం	కొత్తగూడెం	ఆర్జీ–1
అభిలాష్	మేనేజర్	ఆర్జీ–1, 2	మణుగూరు
చంద్రమణి	మేనేజర్	ఎస్టీపీపీ	శ్రీరాంపూర్
రమణారెడ్డి	మేనేజర్	మందమర్రి	ఇల్లెందు
బి.కల్యాణ్	ఆఫీసర్	మణుగూరు	ఆర్జీ–3
నవీన్‌కుమార్	ఆఫీసర్	బెల్లంపల్లి	ఆర్జీ–2
డి.శ్రీనివాస్	జియోలజిస్ట్	శ్రీరాంపూర్	కార్పొరేట్
ఎ.పెద్దరాజు	జియోలజిస్ట్	కార్పొరేట్	ఆర్జీ–1
శ్రీనివాస్	జియోలజిస్ట్	ఆర్జీ–1	(పీ.పీ)
ఎ.హరిప్రసాద్	జియోలజిస్ట్	పీఅండ్‌పీ	కార్పొరేట్
రాజేశ్వర్‌రావు	జియోలజిస్ట్	ఆర్అండ్‌డీ	ఆర్జీ–1
బి.వెంకన్న	జియోలజిస్ట్	ఆర్జీ–1	కార్పొరేట్
ఆర్.ఉమేశ్	ఆఫీసర్	కార్పొరేట్	ఆర్జీ–1
సుమన్	ఆఫీసర్	ఆర్జీ–1	కార్పొరేట్
రామారావు	డీజీఎం	బెల్లంపల్లి	నైనీ
మోహన్‌రెడ్డి	మేనేజర్	కార్పొరేట్	కార్పొరేట్
రవికుమార్	మేనేజర్	కార్పొరేట్	బెల్లంపల్లి
కాంతారావు	ఆఫీసర్	సూపర్‌బజార్	ఎడ్యుకేషన్
శ్రావణ్‌కుమార్	ఆఫీసర్	ఆర్జీ–3	ఆడిట్
ప్రవీణ్‌కుమార్	ఆఫీసర్	కార్పొరేట్	కార్పొరేట్
చలపతిరావు	ఆఫీసర్	విజిలెన్స్	కార్పొరేట్
చిన్నప్రసాద్	ఆఫీసర్	ఇల్లెందు	సూపర్‌బజార్
సీహెచ్ రమేశ్	ఆఫీసర్	కొత్తగూడెం	కార్పొరేట్
ఎం.రమేశ్	ఆఫీసర్	కొత్తగూడెం	కొత్తగూడెం
వి.సందీప్	ఆఫీసర్	ఇల్లెందు	కార్పొరేట్
కె.మురళి	ఆఫీసర్	ఆర్జీ–2	ఇల్లెందు
సీహెచ్ మౌనిక	ఆఫీసర్	భూపాలపల్లి	కార్పొరేట్
జి.సురేశ్	ఆఫీసర్	కార్పొరేట్	కార్పొరేట్
నాగేశ్వర్‌రావు	ఆఫీసర్	కొత్తగూడెం	కార్పొరేట్
డి.రమేశ్	ఆఫీసర్	శాప్, కార్పొరేట్	కార్పొరేట్
పి.భావన	ఆఫీసర్	శ్రీరాంపూర్	కార్పొరేట్
ఉష	డాక్టర్	మందమర్రి	కొత్తగూడెం

పర్సనల్ విభాగం

లక్ష్మీనారాయణ	ఏజీఎం	ఆర్జీ–1	కార్పొరేట్
విలాస్‌పోద్దార్	డీజీఎం	కార్పొరేట్	సూపర్‌బజార్
ఎ.తుకారాం	డీజీఎం	భూపాలపల్లి	ఎస్టీపీపీ
రవీందర్‌రెడ్డి	మేనేజర్	ఆర్జీ–3	ఆర్జీ–1
కె.మారుతి	మేనేజర్	ఆర్జీ–3	భూపాలపల్లి
సుదర్శనం	డీవైపీఎం	శ్రీరాంపూర్	ఆర్జీ–3
పి.రాజు	డీవైపీఎం	శ్రీరాంపూర్	ఎస్ఆర్‌పీ
పి.కృష్ణ	డీవైపీఎం	కేవోసీపీ	కార్పొరేట్
శ్యాంప్రసాద్	డీవైపీఎం	భూపాలపల్లి	వీకేపీ, ఆర్జీ–2
జి.హరీశ్	డీవైపీఎం	జీడీకే–10	పీవీకే–5
శ్రావణ్‌కుమార్	డీవైపీఎం	జీకేవోసీ	కార్పొరేట్
సునీల్‌కుమార్	డీవైపీఎం	ఆర్కే–6	ఎడ్యుకేషన్
శ్రావణ్‌కుమార్	ఆఫీసర్	కేటీకే–6	భూపాలపల్లి
మదార్‌సాహెబ్	ఆఫీసర్	పీకేవోసీ	ఆర్కేపీ
ఎస్.సాధన్	ఆఫీసర్	కేటీకే–1	ఎస్ఆర్‌పీ–1
ఎస్.సురేందర్	ఆఫీసర్	ఓసీపీ–3	ఆర్కే–6
వి.అజయ్	ఆఫీసర్	పీవీకే–5	కేవోసీపీ
జె.శ్రీనివాస్	ఆఫీసర్	ఆర్కేపీ, ఆస్పత్రి	కేటీకే–1
ఒ.బాపు	ఆఫీసర్	వీకేపీ	పీకేవోసీ

మైనింగ్ విభాగం

వెంకటరమణ	డీజీఎం	ఏఎస్‌వో	పీఓ, ఓసీపీ–2
ఎం.మల్లయ్య	డీవైజీఎం	ఇల్లెందు	ఆర్జీ–1గ్రూప్
రాజేందర్	డీవైజీఎం	ఓసీపీ–2	ప్రాజెక్టు(పీ)
రాజశేఖర్	డీవైజీఎం	భూపాలపల్లి	ఏఎస్ఓ, ఆర్జీ–3
రామస్వామి	డీవైజీఎం	ఆర్జీ–1	ఇల్లెందు
ఎ.నెహ్రూ	డీవైజీఎం	జీడీకే–11	వీకేపీ, ఆర్జీ–2
డి.రమేష్	ఎస్ఓఎం	ఓసీపీ–3	జీడీకే–1
ఎం.తిరుపతి	ఎస్ఓఎం	ఏఎల్‌పీ	కేటీకే–1
రమేష్‌బాబు	ఎస్ఓఎం	జీడీకే–1	ఆర్కే–7
మల్లేష్	అండర్ మేనేజర్	జీడీకే–11	జీడీకే–11
కె.శ్రీధర్	అండర్ మేనేజర్	ఆర్జీ–1	ఎస్ఆర్
భరత్‌కుమార్	అండర్ మేనేజర్	ఓసీపీ–3	ఓసీపీ–3
కె.శ్రీకాంత్	అండర్ మేనేజర్	ఏఎల్‌పీ	ఆర్జీ–1
లక్ష్మీనారాయణ	ఎస్ఈ	ఆర్జీ–3	వీటీసీ, ఆర్జీ–1
మహేందర్‌రెడ్డి	అండర్ మేనేజర్	హైదరాబాద్	ఓసీపీ–3
ప్రసాద్	అండర్ మేనేజర్	పీఅండ్‌పీ	జీడీకే–11
బి.మల్లేష్	అండర్ మేనేజర్	జీడీకే–11	జేవీఆర్ఓసీ–2
జయంత్‌కుమార్	డి.మేనేజర్	ఆర్కేపీ–1ఏ	ఏఎల్‌పీ
మల్లికార్జున	అధికారి	జీడీకే–2,2ఏ	జీడీకే–11
అనిల్‌కుమార్	అధికారి	భూపాలపల్లి	ఏఎల్‌పీ
జయప్రసాద్	అధికారి	పీకేఓసీ	జీడీకే–11
పరుశరాములు	అధికారి	జీడీకే–11	కేటీకే–5
జి.శ్రీను	అధికారి	కేటీకే, ఓసీ–2	ఏఎల్‌పీ

విద్యార్థి దశలోనే సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు

రామగుండం: విద్యార్థిదశ నుంచే సత్ప్రవర్తన అలవర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాస్‌రావు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. యువత వ్యసనాలకు బానిసలుగా మారి విచక్షణ కోల్పోతున్నారని అన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ కేసుల పాలై తమ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని సూచించారు. హెచ్ఎం శారద, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీశ్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, న్యాయవాదులు భూమయ్య, ప్రసన్న, షాన్వవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

గోదావరిఖని: ఈవ్‌టీజింగ్, మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం హెచ్చరించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో కేసులు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, టీసేఫ్ యాప్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్యవివాహాలు, వరకట్నం తదితర చట్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో షీటీంలు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మహిళలను వేధించినా, అవహేళన చేసినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా షీటీం నంబర్ 63039 23700 ఫోన్‌కు కాల్‌చేయాలని, లేదా వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయాలని ఆయన సూచించారు. గత నెలలో కమిషనరేట్‌లోని షీటీంకు 8, మంచిర్యాల షీటీంకు రెండు ఫిర్యాదు అందాయని, ఇందులో మూడింటిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ఐదింటిలో తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ చేశామని తెలిపారు. 235 హాట్‌స్పాట్స్‌ను పరిశీలించి డెకాయి ఆపరేషన్ చేశామని ఆయన వివరించారు.

స్వచ్ఛదనం - పచ్చదనంపై దృష్టి



మాట్లాడుతున్న డీఎఫ్‌వో శివయ్య

పాలకుర్తి(రామగుండం): జిల్లాల ఈనెల 5 – 9వ తేదీ వరకు చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి విజయవంతం చేయాలని జిల్లా అటవీశాఖాధికారి శివయ్య కోరారు. స్థానిక రైతువేదికలో పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తడి, పొడిచెత్తను వేర్వురుగా సేకరించి కంపోస్టు ఎరువు తయారుచేయాలని సూచించారు. సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీవో షబ్బీర్ పాషా, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, పుట్నూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిసూర్య పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శ్రీధర్

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా శ్రీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటివరకు విధులు నిర్వర్తించిన డాక్టర్ రమాకాంత్ కరీంనగర్ బదిలీ అయ్యారు. కలెక్టర్ శ్రీహర్షను శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

గేదెను ఢీకొని గాయాలు



గాయపడ్డ పుల్లూరి శ్యాంసుందర్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాజీపల్లి పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనదారు గేదెను ఢీకొట్టాడు. ఈఘటనలో మాతంగికాలనీకి చెందిన పుల్లూరి శ్యాంసుందర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎన్టీపీసీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవయవదానంతో పునర్జన్మ



దోనర్ కార్డులతో ఉద్యోగులు

రామగిరి(మంథని): అవయవదానంతో పునర్జన్మ ప్రసాదించిన వారవుతారని ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అన్నారు. సెంటనరీకాలనీ జేఎన్టీయూలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, అవయవదానం మహాదానమన్నారు. అనంతరం నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాశాల ఉద్యోగులు అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. వారికి డోనర్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశాయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, సలహాదారు నూక రమేశ్, పీడీ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్



పట్టుబడిన తహసీల్దార్ జాహెద్ పాషా, డ్రైవర్ అమ్జద్, ప్రైవేట్ అసిస్టెంట్ ధర్మేందర్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ కృష్ణకుమార్

- భూ పట్టా కోసం లంచం డిమాండ్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఓ రైతు భూ పట్టా విషయంలో లంచం డిమాండ్ చేసిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ జాహెద్ పాషా శనివారం ఏసీబీ అధికారులకు చిక్కారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి కథనం ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం పందిల్ల గ్రామంలోని సర్వే నంబర్ 645/అ లో 28 గుంటలను మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కడెం మల్లయ్య ఇటీవల కొనుగోలు చేశాడు. దాని పట్టాకోసం మల్లయ్య కుమారుడు తిరుపతి కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ జాహెద్ పాషాను సంప్రదించాడు. ఇందుకోసం రూ.50 వేలు లంచం కావాలని తహసీల్దార్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తిరుపతి ఓసారి రూ.15వేలు ఫోన్‌పే ద్వారా, మరోసారి రూ.15వేలు నగదు, ఇంకోసారి రూ.20వేల నగదును తహసీల్దార్‌కు ముట్టజెప్పాడు. అయినా భూమిపట్టా చేయలేదు. విసుగు చెందిన బాధితుడు జూలై 23న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ సదరు భూమికి పట్టాచేశారు. ఇదే భూమి తనఖా పెట్టి రుణం తీసుకునేందుకు అవసరమైన పహాణి(లింక్‌డాక్యుమెంట్) కోసం తిరుపతి తహసీల్దార్‌ను మరో సారి సంప్రదించాడు.



అధికారులు స్వాధీనం చేసుకున్న డబ్బు

పహాణి కోసం మరో రూ.10వేలు కావాలని తహసీల్దార్ డిమాండ్ చేశారు. చేసేదిలేక తిరుపతి కరీంనగర్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన ప్రకారం తిరుపతి శనివారం తహసీల్దార్ వద్దకు రూ.పది వేల నగదు పంపించారు. తహసీల్దార్ తన ప్రైవేట్ అసిస్టెంట్ ధర్మేందర్ ద్వారా లంచం డబ్బులు తీసుకుని తన కారుడ్రైవర్ అమ్జద్‌కు ఇచ్చాడు. అప్పటికే అక్కడ మాటువేసిన ఏసీబీ అధికారులు ముగ్గురినీ పట్టుకున్నారు. ఫొరెన్సిక్ పరీక్షల అనంతరం వేలిముద్రల ఆధారంగా తహసీల్దార్ జాహెద్ పాషా, ప్రైవేట్ అసిస్టెంట్ ధర్మేందర్, డ్రైవర్ అమ్జద్‌పై కేసునమోదు చేశారు. ముగ్గురిని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పర్చుతామని డీఎస్పీ రమణమూర్తి వివరించారు.

'అల్ఫోర్స్' విద్యార్థులకు ఒలింపియాడ్ పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి: ప్రతీ విద్యార్థికి సాధించాలనే ఉత్సాహం ఉండాలని, తద్వారా సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రముఖ ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు, రజతం, కాంస్య పతకాలు సాధించగా వారిని అభినందించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను పోటీ పరీక్షల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టునూలు అంశంపై క్షేత్ర పర్యటన

అల్ఫోర్స్ బాలికల ఇ–టెక్నో పాఠశాలలో 7వ తరగతి విద్యార్థులు పట్టునూలు అనే పాఠ్యాంశాన్ని ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకున్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులు కొత్తపల్లి చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి క్షేత్రాన్ని సందర్శించారు. వస్త్ర తయారీ విధానం, ముడి సరుకు రంగుల అద్దకం, మరమగ్గాల గురించి తెలుసుకున్నారు. ఇటువంటి క్షేత్ర పర్యటనల ద్వారా స్వయంగా వీక్షించి తెలుసుకోవడం చాలా ఆనందకరమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా. వి. నరేందర్‌రెడ్డి అన్నారు.

ముందస్తు స్నేహితుల దినోత్సవం

మల్యాల: మల్యాల అడ్డరోడ్డులోని ఆల్ఫోర్స్‌ఎన్ఎస్వీ పాఠశాలలో శనివారం ముందస్తు స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హాజరైన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కష్టసుఖాల్లో తోడుగా నిలిచేది స్నేహితుడని అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు హాజరైన క్రీడాకారులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన 20మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొమ్ము గట్టయ్య తెలిపారు. అండర్–14, 16, 18, 20లో బాల, బాలికలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని గట్టయ్య వివరించారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ సుదేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రణయ్, జావీద్, మౌనిక, అజయ్, విష్ణు, ప్రవీణ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

29 మంది ఏఈవోలు బదిలీ

కరీంనగర్ అర్బన్: జిల్లాలో భారీగా వ్యవసాయ విస్తరణ అధికారులు బదిలీ అయ్యారు. శనివారం గూగుల్ మీట్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ బదిలీ చేయగా కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి ఏఈవోలు హాజరయ్యారు. జిల్లాలో 76మంది ఏఈవోలు ఉండగా 34మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 4ఏళ్లు నిండినవారికి స్థానచలనం తప్పనిసరి కాగా గ్రేడ్–1 కింద ఏఈవోలు రాము కొత్తపల్లి, పున్నం చందర్ తిమ్మాపూర్‌లో కొనసాగనుండగా ఉదయ్‌కుమార్(చెంజర్ల) కొత్తపల్లి సీడ్‌ఫామ్‌కు, తిరుపతి(ఇల్లందకుంట) కొత్తపల్లి మండలం మల్కాపూర్, శైలజ(కేశవపట్నం) హసన్‌పర్తి మండలానికి బదిలీ అయ్యారు. గ్రేడ్–2లో పి.సతీశ్‌ను సిర్సపల్లి క్లస్టర్‌కి, కె.అనూషను కందుగుల, సుచరిత చామనపల్లి, శివరాం సింగాపూర్, జి.శ్రీలత(సిరిసిల్ల) చెంజర్ల, టి.కీర్తన మొలంగూరు, జి.సుష్మ సైదాపూర్, ఈ.సుస్మితరాణి రుక్మాపూర్, కె.స్రవంతి కేశవపట్నం, ఇస్లావత్ శిరీష నుస్తులాపూర్, ఎ.ప్రణయ్ చిన్నముల్కనూరు, జి.సంపత్ వెదురుగట్ట, గట్టు తిరుపతి మెట్‌పల్లి, గట్టు అచ్యుత్ తనుగుల, ఎస్.శ్రీకాంత్ మానకొండూరు, వి.సౌమ్య బూరుగుపల్లి, కె.ప్రసన్నకుమార్ రుద్రారం, టి.నిఖిల్‌కుమార్ హుజూరాబాద్, వేముల గోపిచంద్ గర్శకుర్తి, వి.వెంకటస్వామి కురిక్యాల, తోట సాయికుమార్ కొండపల్కల, కె.శ్రావణి మల్లాపూర్, మెరుగు సాయికుమార్ మాదాపూర్, జి.శ్రవణ్‌కుమార్ చల్లూరు, గుజ్జెటి రాజేశ్ జమ్మికుంట, ఉజ్మా నిశాంత్ ఇల్లందకుంట క్లస్టర్ ఏఈవోగా నియమించారు.

స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆర్డీవో గంగయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ వెంకటేశ్, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు, ఓబీలకు కార్యక్రమ అమలు తీరుపై వివరించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్, టీపీవో శ్రీహరి, వినయ్, శ్రీశైలం, రమాకాంత్, సురేందర్, మౌనిక, రామ్మోహన్‌రెడ్డి, రాజు తదిరతరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను దూషించిన మాజీ ఎంపీటీసీ అరెస్ట్

మెట్‌పల్లి: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావును దూషించిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సిరిపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ రాములు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను దూషిస్తూ ఓ వీడియోను వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. దీనిపై దామెర నారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు.

రేపటి నుంచి బ్రేక్ దర్శనాలు షురూ

- రాజన్న ఆలయ చరిత్రలో తొలిసారి

వేములవాడ: రాజన్న సన్నిధిలో మొట్టమొదటిసారి బ్రేక్ దర్శనాలను ఈనెల 5 నుంచి ప్రారంభిస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బ్రేక్ దర్శనాలను ఆరంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆలయంలోని ప్రస్తుత శీఘ్రదర్శనం క్యూలైన్‌ను బ్రేక్ దర్శనాలకు ఉపయోగించుకుని, శీఘ్రదర్శనం భక్తులను ఆలయ తూర్పు ద్వారం నుంచి నేరుగా పంపించేందుకు క్యూలైన్లు సిద్ధం చేసినట్లు ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ తెలిపారు.

రెండుసార్లు బ్రేక్ దర్శనాలు

ఈనెల 5 నుంచి ప్రారంభించే బ్రేక్ దర్శనాలను నిత్యం రెండు సార్లు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనాలు కొనసాగనున్నాయి. ఇందుకు రూ.300 టికెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రతీ టికెట్‌కు ఒక లడ్డూ ప్రసాదం ఉచితంగా అందించనున్నారు.



శ్రావణమాసం ఉత్సవాలకు ఏర్పాట్లు

రాజన్న సన్నిధిలో ఈనెల 5 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు శ్రావణమాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజులపాటు భక్తుల రాకతో రాజన్న క్షేత్రం సందడిగా మారనుంది. ప్రతీ సోమవారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి మహాలింగార్చన నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ప్రతీ శుక్రవారం ఆలయ అనుబంధ మహాలక్ష్మి ఆలయంలో చతుష్షష్టి పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో ఐదు సోమవారాలు, నాలుగు శుక్రవారాలు వస్తున్నాయని అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ తెలిపారు.